పెండింగ్ పనులు పూర్తి చేయండి



డిప్యూటీ కమిషనర్‌తో మాట్లాడుతున్న షఫిఉద్దీన్

చాదర్‌ఘాట్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పెండిగ్ పనులు పూర్తి చేయాలని ఓల్డ్‌మలక్‌పేట కార్పొరేటర్ మహ్మద్ షఫిఉద్దీన్ డిప్యూటీ కమిషనర్ జయంత్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో కొన్ని కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న రోడ్డు మరమ్మతులను పూర్తి చేయాలని, అదేవిధంగా ముంపు ప్రాంతాల్లో నీరు నిలిచి కొంత మేర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పనులు ప్రారంభించాలని కోరారు. శానిటేషన్ డ్రైనేజీల పనులపై దృష్టి సారించి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరగా అందుకు డీసీ సానుకూలంటా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో వార్డ్ మెంబర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రహదారి అవినీతిపై అధికారుల విచారణ

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీ వాంబే గృహ సముదాయాల వద్ద సీసీ రహదారి విషయంలో చోటు చేసుకున్న రూ.10 లక్షల అవినీతి ఆరోపణలపై జీహెచ్‌ఎంసీ అధికారులు విచారణ చేపట్టారు. మంగళవారం ఆరుగురు అధికారుల బృందం సింగరేణి కాలనీ వాంబే గృహాల వద్దకు చేరుకుని స్థానికులతో వివరాలు సేకరించారు. అధికారుల బృందం చార్మినార్ జోనల్ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చారని తెలుస్తోంది.

ఆర్‌యూబీ ప్రారంభం ఎప్పుడో?



చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని రైల్వే అండర్ బ్రిడ్జి పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని జీహెచ్‌ఎంసీ, రైల్వే డిపార్ట్‌మెంట్ వారు రూ. 35.44 కోట్ల వ్యయంతో నిర్మించారు. ఇరు శాఖల నడుమ సమన్వయం లోకపోవడంతో ప్రారంభోత్సవంలో జాప్యం జరుగుతున్నట్లు సమాచారం.

సైనిక్ స్కూల్స్ ఫలితాల్లో సత్తా



సత్తా చాటిన రేయాన్ స్కూల్ విద్యార్థులు

నాగోలు: ఆల్ ఇండియా సైనిక్ స్కూల్–2025 ఫలితాల్లో నాగోలులోని రేయాన్ సైనిక్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటినట్లు చైర్మన్ జి. జనార్దన్ రెడ్డి తెలిపారు 8, 5వ తరగతి ప్రవేశాల కోసం జరిగిన జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మంగళవారం ఆయన అభినందించి మాట్లాడారు. జాతీయ స్థాయిలో రేయాన్ సైనిక్ స్కూల్ విద్యార్థులు అశ్వర్థా 8 వతరగతి ప్రవేశానికి మొదటి ర్యాంకు, విపుల్ 5 ర్యాంకు సాధించాడు. 5వ తరగతి ప్రవేశాలకు హనీష్ రెడ్డి 4వ ర్యాంక్ సాధించాడు.జాతీయ స్థాయిలో అమృత్ యాదవ్, శ్రీతేజ, సాకెత్, దీక్షత్ రాజ్ రెడ్డి, అక్షిత్‌రెడ్డి, అకున్ బాలజీ, బాను ప్రసాద్, అద్విక్‌రాజ్, వంశీ మల్లెల తో పాటు 68మంది సత్తాచాటారన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర ఉమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్‌పై అవగాహన సదస్సు

బడంగ్‌పేట్: మున్సిపల్ కార్యాలయంలో నేషనల్ అక్షన్ ఫర్ మెకానైజ్ శానిటేషన్ ఎకో సిస్టం కార్యక్రమంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బందికి వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సదస్సుకు మున్సిపల్ కమిషనర్ పి.సరస్వతి ముఖ్యులుగా పాల్గొని శానిటేషన్ సిబ్బందికి అవగాహన కల్పించారు. జెన్ రోబోటెక్ కేరళ సంస్థ రూపొందించిన విధానాన్ని సిబ్బందికి వివరించారు. శానిటేషన్ సిబ్బందికి ఆరోగ్యపరమైన సేఫ్టీకిట్స్, హెల్త్ ఇన్సూరెన్స్, సబ్సిడీ, వృత్తి పరమైన అంశాలపై మెలకువలు, సఫాయి వర్కర్లకు పీపీఈ కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ శ్యామ్ సుందర్, మేనేజర్ బి.నాగేశ్వర్‌రావు, డిప్యూటీ డీఈఈ వెంకన్న, ఆర్‌ఓ వేణుగోపాల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి, శానిటేషన్ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

అబిడ్స్: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ అబిడ్స్–14వ సర్కిల్ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. మంగళవారం నియోజకవర్గంలోని మంగళ్‌హాట్, ధూల్‌పేట్, అబిడ్స్, చిరాగ్‌గల్లీతో పాటు పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మంజుల సింగ్ ఆధ్వర్యంలో సెక్షన్ అధికారి నరేష్, ఇతర సిబ్బంది ఈ తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. నియోజకవర్గంలోని బేగంబజార్, ఫీల్‌ఖానా, మహారాజ్ గంజ్ మిగతా ప్రాంతాల్లో కూడా వేగవంతంగా ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తామని అధికారులు వెల్లడించారు.

తరుముకొస్తున్న ముంపు ముప్పు!

- పూర్తికాని అధికారుల కార్యాచరణ ప్రణాళిక
- నాలాల్లో తొలగించని పూడిక
- భయం గుప్పిట్లో లోతట్టు కాలనీలవాసులు



ప్రతి వర్షాకాలంలో సైదాబాద్, సింగరేణి ఆఫీసర్స్ కాలనీ దుస్థితి ఇలా..

దిల్‌సుఖ్‌నగర్: వర్షాకాలం వస్తుందంటే చాలు.. మలక్‌పేట్‌జోన్ పరిధిలోని కాలనీలవాసులకు వెన్నులో వణుకు మొదలవుతోంది. ఏ అర్ధరాత్రి తమ ఇళ్లలోకి వరద వస్తోందోనని బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోంది. ఏళ్ల తరబడి వేధిస్తున్న ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇటీవల కురిసిన చినుకులకే ఇప్పటికీ పలు కాలనీల్లో డ్రైనేజీలు పొంగుతూనే ఉన్నాయి. నాలాల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా డ్రైనేజీలు పొంగి కాలనీలను దుర్గంధంగా మారుస్తున్నాయి.

ప్రారంభం కాని పూడికతీత పనులు..

◆ జోన్ పరిధిలోని సరూర్‌నగర్, మలక్‌పేట్, సంతోష్‌నగర్ సర్కిళ్ల పరిధిలోని నాలాల్లో ఇంత వరకు పూర్తిస్థాయిలో చెత్తను తొలిగించలేదు.ఓపెన్ నాలాల పూడికతీత పనులు ఇంకా పూర్తికాలేదు. దీనికి తోడు వేసవిలో ఎక్కడిక్కడే రోడ్లను తవ్వి మళ్లీ మరమ్మతులు చేపట్టలేదు. లోతట్టు ప్రాంతాల ముంపు సమస్యపై ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో జోన్ పరిధిలోని ముంపు కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు.

◆ వర్షకాలం వచ్చిందంటే లోపట్టు ప్రాంతాల వాసుల కంటిమీద కునుకు కరువుతోంది. ఏళ్ల తరబడి ఈ సమస్యతో నరకయాతన అనుభిస్తున్నారు. తమ జీవితాలు అతలాకుతలం అవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులకు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వచ్చినా ముంపు సమస్యకు ప్రధాన కారణాలైన ప్రధాన నాలాలు, డ్రైనేజీలలో చెత్తను ఇంత వరకు తొలిగించలేదంటే దీనికి సంబంధిచిన అధికారుల నిర్లక్షమని అర్థమవుతుంది. ముంపు సమస్య పరిష్కారానికి అధికారులు దూర దృష్టితో ముందస్తు చర్యలు తీసుకోవపోవడం దురదృష్టకరం, వర్షం కురిస్తే నీరు రోడ్డుపై ఏరులై పారే ప్రమాదం ఉంది. వర్షం వచ్చిన ప్రతిసారీ కాలనీలు ముంపునకు గురవుతున్నా సమస్య అధికారుల్లో మాత్రం చలనం లేదు.

పర్యటనలు తప్ప పరిష్కారాలేవీ?

వర్షం వచ్చినప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధిలు పర్యటనలే తప్ప ఏ కాలనీలో ఇప్పటి వరకు వర్షం నీటికి శాశ్వత పరిష్కారం చేయలేదు. దీంతో ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ముంపునకు గురయ్యే కాలనీల్లో డ్రైనేజీ, మ్యాన్ హోళ్ల నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వివిధ పనుల నిమిత్తం తవ్విన రోడ్లు గుంతలమయంగా మారినా ఇంత వరకు మరమ్మతులు చేపట్టకుండా కాలాయపన చేస్తున్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు

చంపాపేట: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత అన్నారు. మంగళవారం చంపాపేట చౌరస్తాలోని మూడుగుళ్ల ఆవరణలో శ్రీమాతా అన్నపూర్ణేశ్వర అన్న ప్రసాద వితరణ ట్రస్ట్ చైర్మన్ దండేటికార్ భగవాన్‌జీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె చుక్కల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డా వేణుకుమార్‌తో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 500 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం అన్న ప్రసాద వితరణ ట్రస్ట్ ఆధ్వర్యంలో 700 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. భగవాన్‌జీ మాట్లాడుతూ...ప్రతీ అమావాస్య రోజు అన్న ప్రసాద వితరణ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రవి ముదిరాజ్, సుశీల్‌కుమార్, సంతోష్, ప్రవీణ్, ఘనసాల చింటు, రాజు, హరిలాల్ నాయకలు రాజేష్, తిలక్, కిషన్ పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి



పనులు ప్రారంభిస్తున్న అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్: ప్రణాళికాబద్ధంగా సైదాబాద్ డివిజన్ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ఏపీఏయూ కాలనీ, జయానగర్ కాలనీల్లో నూతనంగా నిర్మించనున్న సీసీ రహదారి నిర్మాణ పనులను కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. సైదాబాద్‌లోని ఆయా ప్రాంతాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను స్థానికులు సైతం తరచూ పరిశీలిస్తుండాలని, ఏదైనా అవకతవకలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే ఎక్కడైనా ఏదైనా సమస్య ఉంటే తనకు సమాచారమిస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, ఏపీఏయూ కాలనీ అధ్యక్షుడు మడిగెల విజయ్‌భాస్కర్‌రెడ్డి, వెంకటరెడ్డి, శ్యాంప్రసాద్, మట్టారెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయాలి



కార్పొరేటర్‌కు వినతి పత్రం ఇస్తున్న మహమూద్

సైదాబాద్: విద్యా హక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక సైదాబాద్ మండల కన్వీనర్ షేక్ మహమూద్ కోరారు. మంగళవారం ఐఎస్‌సదన డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డిని కలిసి బాలల హక్కుల పరిరక్షణలో తమ వంతు కృషి చేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఫీజుల నియంత్రణ కమిటీ ఏర్పాటు కోసం తమ పరిధిలో పోరాడాలని, ప్రభుత్వానికి తెలిసేలా తమ గొంతు వినిపించాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తుంటంతో అనేక మంది పేద విద్యార్థులు చదువుకోలేక పోతున్నారని ఫీజుల నియంత్రణకు కృషి చేయాలన్నారు.

తొలిగిన చెత్త

సాక్షి ఎఫెక్ట్..



చెత్తను తరలిస్తున్న సిబ్బంది

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని వికలాంగుల జాతీయ పార్కు వద్ద భారీగా చెత్త పేరుకుపోతుండంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వచ్చేది. ఈ సమస్యపై 'పేరుకుపోతున్న చెత్త.. తరలించేదెప్పుడంటా' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించారు. మంగళవారం ఉదయం సిబ్బందితో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. సమస్యల పరిష్కరానికి చొరవ చూపిన సాక్షికి వాకర్స్ కృతజ్ఞతలు తెలిపారు.

నాలా పనుల పూర్తికి వినతి



మేయర్ విజయలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న సుజాతనాయిక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలో నత్తనడకన జరుగుతున్న ఎస్‌ఎన్‌డీపీ నాలా పనులను పూర్తి చేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ కోరారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న మేయర్ గద్వాల విజయలక్ష్మీకి కార్పొరేటర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుజాతానాయక్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని ఏపీఎస్‌ఈబీ కాలనీ నుంచి బైరామల్‌గూడ చెరువు వరకు జరుగుతున్న వరదనీటి కాలువ పనులు నత్తనడకన జరుగుతున్నాయని, అదే విదంగా వందనపురికాలనీ నుండి కేకేగార్డెన్స్ వరకు మంజూరైన పనులు ఇంకా మొదలు కాలేదని వెంటనే ఈ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మేయర్‌ను కోరారు.

అన్నదానం

నాగోలు: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) మహిళ విభాగ్ ఆధ్వర్యంలో మంగళవారం అమావాస్య సందర్భంగా కొత్తపేట మోహన్‌నగర్‌లో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఉప్పల శ్రీనివాస్ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని దానాల కన్న అన్నదానం గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో మంజుల, నళిని, మనిమాల, పోలఅర్చన,లలిత, సరిత, పద్మజ, సరిత, దాక్షాయణి పాల్గొన్నారు.

ఆటో దొంగ రిమాండ్

చాదర్‌ఘాట్: పాత నేరస్తుడు ఆటో దొంగను చాదర్‌ఘాట్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మిధానిలో నివసించే పాత నేరస్తుడు నేనావత్ రవీందర్ (31) ఈనెల 24న పల్టన్‌లో ఒక ఆటోను తొంగిలించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీఉసలు మంగళవారం రవీందర్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

గృహహింస చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

సైదాబాద్: గృహహింస చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ అన్నారు. మంగళవారం సైదాబాద్ డివిజన్ మాధవనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సైదాబాద్ పోలీసులు, మహిళా భద్రతా విభాగం సీడీఈడబ్ల్యూ సెంటర్ ప్రతినిధులు స్థానికులకు, విద్యార్థినులకు గృహహింసపై అవగాహన సదస్సు నిర్వహించారు. తమ పరిసరాల్లో గృహహింస చూసినప్పుడు బాధితులకు చట్టాల గురించి తెలియజేయాలని సీడీఈడబ్ల్యూ సెంటర్ ప్రతినిధులు సూచించారు. ఫ్యామిటీ కౌన్సెలింగ్ సెంటర్ల ద్వారా తాము అందించే సేవలను వారు వివరించారు. అవసరం ఉన్న సమయాల్లో తమను ఎలా సంప్రదించాలో, అలాగే షీ టీమ్స్ సేవలు ఎలా పొందవచ్చో అని వివరించారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న మల్లేశ్‌గౌడ్

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ రోడ్డుకు అనుసంధానంగా 60 కాలనీలు ఉన్నాయి. ఈ కాలనీల నుంచి వందలాది మంది విద్యార్థులు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని తమ కాలనీలకు బస్సు సౌకర్యం కల్పించాలని డివిజన్ బీజేపి పార్టీ అధ్యక్షుడు మల్లేశంగౌడ్ మంగళవారం ఎంపీ ఈటల లెటర్ హెడ్ మీద రాసిన లేఖను ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. బీఎన్‌రెడ్డినగర్ నుంచి తెలంగాణ చౌరస్తా మీదుగా జిల్లా పరిషత్ రోడ్డులోని కాలనీల మీదుగా టీకేఆర్ కమాన్ మీదుగా బస్సులు సాయంత్రం రెండు బస్సులు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాధవరెడ్డి, రాజుగౌడ్, వెంకటేశ్‌గౌడ కిరణ్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, సోమిరెడ్డి, శేఖర్‌గౌడ్, కంది శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్‌యాదవ్, మల్లేష్‌యాదవ్, నవనీత్ పాల్గొన్నారు.

పూజల పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు

నాగోలు: పూజల పేరుతో ఓ మహిళను నమ్మించి బంగారు ఆభరణాలు, నగదు కాజేసిన వ్యక్తిపై కేసు నమోదైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల వివరాల ప్రకారం.. నాగోలు జైపురికాలనీ సమీపంలో వీరారెడ్డి కాలనీకి చెందిన గుండు రజనీ తన బంధవును తీసుకుని గురూజీ సాయిరాజ్ అనే వ్యక్తి వద్దకు వెళ్లింది. అతడు తాను వశీకరణ నిపుణుడని కుటుంబ సమస్యలకు పరిష్కారాలను చూపుతానని నమ్మించాడు. నీ భర్తపై మరొక మహిళ ప్రభావంతో విడిపోతాడని భయపెట్టాడు. మీ సమస్యలు పరిష్కరించడానికి శక్తిపీఠాల్లో ప్రత్యేక పూజలు చేయాల్సిందని నమ్మించి పూజల పేరుతో సాయిరాజ్ రూ. 32 వేల నగదు, 5 తులాల బంగారు ఆభరణాలు తీసుకుని మోసం చేశాడు. వశీకరణ పేరుతో మరి కొన్ని పూజలు చేయాలని చెప్పడంతో మోసపోయినట్లు గ్రహించి గత నెల 28న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రస్తుతం సాయిరాజ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమతులు లేని సీవరేజీ లైన్ తొలగింపు



మన్సూరాబాద్: ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకున్న సీవరేజీ లైన్‌ను ఎల్‌బీనగర్ వాటర్ వర్క్స్ జీఎం శ్రీనివాస్ రెడ్డి మంగళవారం తొలగింపజేశారు. మన్సూరాబాద్‌లోని సుభోదయకాలనీలో ఓ అపార్టుమెంట్ యజమాని వాటర్ వర్క్స్ అధికారుల నుంచి అనుతులు తీసుకోకుండా రాత్రికి రాత్రే మురుగునీటి పైప్‌లైన్ వేసుకుని కాలనీ నుంచి వెళ్తున్న డ్రైనేజీలో కలుపుకున్నాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా డ్రైనేజీ పైప్ లైన్లు ఏర్పాటు చేసుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి

మీర్‌పేట: దేశ జనాభాలో సగభాగం ఉన్న యువత రాజకీయాల్లోకి రావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం మీర్‌పేట లెనిన్‌నగర్ 33వ వార్డు శాఖ మహాసభకు రవీంద్రాచారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దోపిడీ లేని సమాజం రావాలంటే యువశక్తితోనే సాధ్యమన్నారు. అవినీతి, నిరుద్యోగం, పేదరికం దేశంలో రోజురోజుకు పెరిగిపోతోందని, యువకుల్లో చైతన్యం ద్వారానే వాటిని రూపుమాపవచ్చన్నారు. అనంతరం 33వ శాఖ నూతన కార్యదర్శిగా జటోత్ రెడ్యానాయక్, సహాయ కార్యదర్శిగా మిరియాల లక్ష్మమ్మ, కౌన్సిల్ సభ్యులుగా కేతావత్ శ్రీనునాయక్, వడ్యా దత్తునాయక్, మహేందర్, గోవిందునాయక్, కైలాస్‌నాయక్, వెంకటయ్య ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. కార్యక్రమంలో పార్టీ బాలాపూర్ మండల కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు డేరంగుల శంకరయ్య రమావత్ పాండునాయక్, బండ యాదమ్మ, జాజుల అంజయ్య, ఛత్రునాయక్ పాల్గొన్నారు.

మూడేళ్ల సమస్యకు పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్..



పైపులైన్ పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ వెంకట్రామ్, నాయకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని 16వ వార్డులో నెలకొన్న అవుట్‌లెట్ సమస్య కారణంగా మూడేళ్లుగా ఇళ్ల మధ్య నీరు నిలుస్తుండడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందుల విషయమై సాక్షి దినపత్రికలో ఈ నెల 26వ తేదీన 'ఇంట్లో ఉండలేక.. వీధుల్లో నడవలేక' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే సబితారెడ్డి వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్‌ను ఆదేశించింది. కమిషనర్‌తో పాటు గ్రామ నాయకులు యంజాల అర్జున్, వై.శివకుమార్‌లు స్పందించి వెంచర్‌లో నీరు నిల్వకుండా కార్గో రోడ్డు వద్ద ఉన్న నాలా వరకు పైపులైన్ వేస్తామని దిగువన ప్రజలకు సర్దిచెప్పారు. దీనికి అందరూ అంగీకరించడంతో మంగళవారం పనులను ప్రారంభించారు. ప్రజలు కొనుగోలు చేసిన 20 గజాల స్థలం నుంచి వెంచర్‌లో ఉన్న మ్యాన్‌హోల్ వరకు పైపులైన్ వేసి ఇళ్ల మధ్య నిలిచిన నీరు ముందుకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. సమస్య తీవ్రతను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కార దిశగా ప్రయత్నించిన సాక్షి దినపత్రికకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

మహేశ్వరం: మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను అమెజాన్ సంస్థ, వేదాంషి ఫౌండేషన్ ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. లైబ్రరీని ఏర్పాటు చేసి సుమారు 500 పుస్తకాలను ఏర్పాటు చేశారు. లైబ్రరీ రూమ్‌లో పెయింటింగ్స్ వేసి విద్యార్థులకు ఉపయోగపడే బొమ్మలు గీశారు. విద్యార్థులకు అమెజాన్ సంస్థ ప్రతినిధులు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. వారి మౌలిక వసతులు కల్పించి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. భవిష్యత్‌లో పాఠశాలలో మరిన్ని సదుపాయాలు కల్పిస్తామని అమెజాన్ ప్రతినిధులు వెల్లడించారు.

ఎల్‌ఓసీ అందజేత

చైతన్యపురి: ముఖ్యమంత్రి సహాయ నిధితో పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చైతన్యపురి డివిజన్ సాయినగర్ కాలనీకి చెందిన రాధకు మంజూరైన రూ.1.5లక్షల ఎల్‌ఓసీ పత్రాలను మంగళవారం ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం రిలీఫ్ ఫండ్ ఓ వరం లాంటిదని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సికింద్రాబాద్–మహేశ్వరం వరకు బస్సు సర్వీస్

ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మీసుధ



సికింద్రాబాద్ నుంచి మహేశ్వరం వరకు తిరిగే బస్సు సర్వీస్

మహేశ్వరం: రాణిగంజ్ డిపో నుంచి తుక్కుగూడ వరకు నడుస్తున్న 8ఏ, 253ఎం నంబర్ బస్సును మహేశ్వరం వరకు పొడిగించి నడిపిస్తున్నారని ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మీసుధ తెలిపారు. గత కొన్నిరోజుల నుంచి రాణిగంజ్ డిపో నుంచి సికింద్రాబాద్ నుంచి తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీ కమాన్ వరకు బస్సు సర్వీస్‌ను నడిపిస్తున్నారని, దీనిని ప్రస్తుతం మహేశ్వరం మండల కేంద్రం వరకు బస్సును పొడిగించారని స్పష్టం చేశారు. మహేశ్వరం, తుక్కుగూడ, రావిర్యాల, శ్రీనగర్, మంఖాల్ ప్రాంతాల్లో భారీ పరిశ్రమలు ఏర్పాటు కావడంతో ఇక్కడ బీహార్, ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కర్ణాటక, ఒడిసా, అస్సాం, హర్యానా పలు రాష్ట్రాల నుంచి కార్మికులు వచ్చి ఈ ప్రాంతాల్లో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వారు ఆ ప్రాంతాల నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లాలంటే అక్కడివరకు ఆర్టీసీ బస్సులో వెళ్లడానికి సౌకర్యవంతంగా ఉంటుంది. అంతేకాకుండా ఈ ప్రాంతాల ప్రజలు, ఉద్యోగులు హైద్రాబాద్ వెళ్లడానికి సులువు అవుతుందన్నారు. ఈ బస్సు రోజు నాలుగు ట్రిప్పులు తిరుగుతుందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకొని ఆర్టీసీ ఆదాయం పెంచాలని కోరారు. బస్సు పొడిగించడంపై మహేశ్వరం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.